




# కరపత్రం

SINCE 2014

శనివారం డిసెంబర్ 21 2024 | సంపుటి :0 | సంచిక : 73 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4



# ఫార్ములా–ఈ కార్‌పై

## ఎప్పుడైనా? ఎక్కడైనా చర్చకు సిద్ధం:



హైదరాబాద్:
ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌పై సభలో చర్చించాలని కేటీఆర్ ఇంతకాలం ఎందుకు అడగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. "ఈ కార్ రేస్ ప్రతినిధులు వచ్చి నన్ను కలిశారు. రూ.600 కోట్లు పెండింగ్ నిధులు రావాల్సి ఉంది.. ఇవ్వమని అడిగారు. మీరు ఊ.. అంటే మరోసారి రేసింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్ఈవో ప్రతినిధులు వచ్చి కలిసిన తర్వాతే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

హెచ్ఎండీఏ ఖాతాలోని రూ.కోట్ల నిధులు లండన్‌లోని కంపెనీకి నేరుగా ఎలా వెళ్తాయి? నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం రూ.600 కోట్ల విలువైనది. మిగతా డబ్బు కోసం వాళ్లు వచ్చినప్పుడే ఈ విషయం నా దృష్టికి వచ్చింది. ఓఆర్ఆర్ అమ్మినా.. హెచ్ఎండీఏ నిధులు కాజేసినా.. అడగవద్దన్నట్లు మాట్లాడుతున్నారు. నేను జాగ్రత్త పడటం వల్ల రూ.450 కోట్లు మిగిలాయి. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరుగుతోంది.. హైకోర్టులో కేటీఆర్ వేసిన పిటిషన్‌పై విచారణ జరుగుతోంది కాబట్టి ఎక్కువ వివరాలు వెల్లడించలేను. న్యాయపరంగా చిక్కులు లేకపోతే ఈ వ్యవహారంపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధం. అవసరమైతే భారాస కార్యాలయానికి వెళ్లి అయినా చర్చిస్తాం. రూ.55 కోట్లు చిన్న విషయం కాదు" అని సీఎం అన్నారు.





## కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయొద్దు:

- ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది.
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది.
- ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది.

ప్రాథమిక దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు.

2లో

## తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉంది: సీఎం రేవంత్‌రెడ్డి

- తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.
- 'భూ భారతి' బిల్లుపై చర్చలో భాగంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు.
- "తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి.
- భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు.

2లో



## జైలుకెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?:

- పార్లమెంటులో అంబేడ్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు.
- అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు.
- క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ-రేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు.

ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈ-రేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు.

2లో

## కాంగ్రెస్ ప్రభుత్వమైనా

### భూముల ఆడిటింగ్ చేయాలి: అక్బరుద్దీన్ ఒవైసీ

ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారాస సభ్యుల తీరును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు.



2లో

# సంపాదకీయం

## మన రాజ్యాంగంలో భారతీయత...!

భారత రాజ్యాంగంలోని భారతీయత ఏమిటి? భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభలలో మన సంవిధానంపై జరిగిన చర్చ ఆ ఆసక్తికరమైన ప్రశ్నను పూర్తిగా ఉపేక్షించింది. పాలక పక్షానికే కాకుండా ప్రతిపక్షానికీ అది ఒక ఇబ్బందికరమైన ప్రశ్నే. లోక్‌సభ ఎన్నికలలో సొంత మెజారిటీని సాధించుకోలేకపోయిన నేపథ్యంలో ప్రస్తుత దశలో ఆ ప్రశ్నను లేవనెత్తడం అంత వివేకవంతమైన పనికాదని పాలక పక్షం తప్పక భావించి ఉంటుంది. ఈ కారణంగా భారతీయ జనతా పార్టీ తన భావజాల పరమైన ఉత్సాహాన్ని నియంత్రించుకుని రాజ్యాంగాన్ని ప్రశ్నించే పనిని పార్లమెంటు వెలుపల తన మేథో మద్దతుదారులు, సహ ప్రయాణీకులకు వదిలివేసిందిబీ పార్లమెంటులో ప్రధానమంత్రి భారత రాజ్యాంగ పరిరక్షణకు తన నిబద్ధతను నొక్కి చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తిని పాటించడంలో తమ ప్రభుత్వం అద్వితీయంగా వ్యవహరిస్తోందని ఆయన వివరించిన తీరు ఒక నిరర్థక హాస్య సన్నివేశంగా పరిగణించాలి. ప్రతిపక్షాలకు ఆ ప్రశ్న సైద్ధాంతికంగా ఒక జటిల సమస్యగా, సాంస్కృతికంగా చమత్కారపూరితమైనదిగా అనిపించి ఉండవచ్చు. కనుకనే అవి ఆ ప్రశ్నను నిర్లక్ష్యం చేశాయి. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో సావర్కార్ గురించి ప్రస్తావించినప్పుడు ఆ ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు ఉద్యుక్తుడు అయినట్టు కనిపించాడు కానీ ఆయన దానిపై మనసు పెట్టలేదు. అలా ప్రస్తావించి ఇలా వదిలివేశారు. ఆ చర్చ యథావిధిగా రాజకీయ వాదోపవాదాలుగా, పరస్పరం బురదజల్లుకోవడంగా దిగజారింది.

పాలక ప్రతిపక్షాలు పట్టించుకోనంత మాత్రాన ఆ ప్రశ్న ప్రాధాన్యం కోల్పోతుందా? రాజ్యాంగం పట్ల భారతీయ జనతా పార్టీ కొత్త శ్రద్ధాసక్తులు, ప్రేమానురాగాలను చూసి మనం మోసపోకూడదు సుమా! మన రాజ్యాంగబద్ధ గణతంత్ర రాజ్యంపై కనిపించీ కనిపించకుండా జరుగుతున్న ఒక దాడి మధ్యలో మనం ఉన్నాం. మరి ఈ దాడికి రాజ్యాంగం న్యాయబద్ధతను ప్రశ్నించడం ఒక అనివార్యత. ఆ సంవిధాన భారతీయతను ప్రశ్నించడమనేది రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారి బలమైన ప్రధాన భావజాల అస్త్రం. సందేహం లేదు, అదొక ఆలోచనాత్మకమైన ప్రశ్న. నిబద్ధతతో దానిని తర్కించవలసి ఉంది. మన రాజ్యాంగాన్ని చాలవరకు మన వలసపాలకుల భాషలో ఆలోచించి రాయడం జరిగింది. ఆధునిక పాశ్చాత్య రాజ్యాంగవాద ఆలోచనాస్రవంతి నుంచి గ్రహించిన అంశాలతో భారత రాజ్యాంగ రచనా నిర్మాణం జరిగింది. ఆ రాజ్యాంగం 'భారతీయ సంప్రదాయానికి 'విరుద్ధమైనది'., 'విదేశీయమైనది' అని రాజ్యాంగ సభలోనే పలువురు సభ్యులు ఆక్షేపించారు. దాని 'భారతీయత' గురించి పలు ప్రశ్నలు అప్పుడే లేవనెత్తడం జరిగిందనే విషయాన్ని మనం మరువ కూడదు.

ఆధునికతావాద, విశ్వజనీన దృక్కోణం ఈ ప్రశ్నకు సబబైన సమాధానం కాబోదనే వాస్తవాన్ని కూడా అంగీకరిద్దాం. 'ఆధునిక భారత రాజ్యాంగం విధిగా భారతీయమైనదిగా ఎందుకు ఉండాలి?' అని ప్రశ్నించవచ్చు. అయితే ఇది ఆ ప్రశ్నకు మాటకు మాటమాత్రమే అవుతుంది. ఇటువంటి అనుచిత ప్రతినిందతో ప్రయోజనముండదు. ప్రతి రాజ్యాంగమూ తన సొంత సందర్భంలో సాంస్కృతిక వాస్తవికత అనే పరీక్షలో నిలబడాలి. ఈ ఆధునికతా ప్రతిస్పందన కూడా ప్రతికూలంగా పరిణమించవచ్చనే వాస్తవాన్ని విస్మరించకూడదు. ఆధునిక రాజ్యాంగ నిర్మాతలు గతం నుంచి పూర్తిగా వేరుపడడానికి తీవ్ర ఆసక్తి చూపారు. ఈ కారణంగానే అది భారతీయత నుంచి వేరుపడిందని, మన నాగరికతా విలువలకు పరాయిదిగా ఉన్నదనే భావన చాలా మందిలో ఏర్పడేందుకు దారితీసింది.

అసలు భారతీయత అంటే ఏమి కాదో మొదట చూద్దాం. భారత రాజ్యాంగం భారతదేశ గతం నుంచి ప్రభవించిందికాదు. రాజ్యాంగ నిర్మాతలు దానిని అలా ఉద్దేశించలేదు. 'విదేశీ'మైనది ఏదీ అంటకూడదు, సోకకూడదు అని కూడా వారు భావించలేదు దానితో ప్రభవించింది కానేకాదు. ఒక లిఖిత రాజ్యాంగం అవసరమైన ఆధునిక రాజ్య వ్యవస్థ సందర్భాన్ని వారు విస్మరించలేదు. ఈ రీత్యా భారత రాజ్యాంగం అనేది ఒక విరోధాభాస. అనూచానంగా వస్తున్న మన జీవనస్రవంతికి సంబంధించిన ఏదో ఒక లక్షణం ఉన్నంత మాత్రాన అది భారతీయమైనదని చెప్పడానికి వీలులేదు. రాజ్యాంగ లిఖిత ప్రతిపై భారతీయ ఇతిహాసాలు, పురాణ గాథలను చిత్రించిన బొమ్మలు దాన్ని భారతీయమైనది చేయలేదు. భారత శిక్షా స్మృతికి భారతీయ న్యాయసంహితగా పునః నామకరణం దాన్ని భారతీయమైనది చేయలేదు.భారత రాజ్యాంగంలో భారతీయతకు అన్వేషణ రెండు రూపాలను తీసుకుంటుది. ఒకటి మరో దానికంటే మరింత ఎక్కువగా మౌలికమైనది. అభ్యుదయ ఆకాంక్షాభరిత అవతారంలో ప్రామాణికతకు ఒక కొత్త నవీనత అవసరం.

భారతీయ తరహా రాజ్యాంగం అంటే పాశ్చాత్య దేశాల నుంచి స్వీకరించిన రాజనీతి చింతనను పూర్తిగా వదిలివేయవలసి ఉంటుంది. మన నాగరికతా వారసత్వం ప్రాతిపదికన రాజ్యాంగ సంస్థలను పూర్తిగా సరికొత్త రీతుల్లో నిర్మించుకోవలసి ఉంటుంది. గాంధీ తన 'హింద్ స్వరాజ్'లో కోరింది ఇదే. కనుకనే శ్రీమన్ నారాయణ్ లాంటి గాంధేయవాదులు భారత రాజ్యాంగం భారతీయ మేధాశక్తికి న్యాయం చేయలేదని వాపోవడానికి కారణమయింది. గత శతాబ్దిలో అమలులోకివచ్చిన ఏ కొత్త రాజ్యాంగమూ (ఇరాన్, బొలీవియాని మినహాయిస్తే) ఈ ప్రామాణికత పరీక్షకు నిలబడలేవు. ప్రత్యామ్నాయ రాజ్యాంగం కోసం అన్వేషణ సహేతుకమైన ఆకాంక్షే కావచ్చుగానీ, అటువంటి రాజ్యాంగానికి సుసంబంధమైన ముసాయిదా అనేది ఏదీ ఎవరి వద్దా లేదు. ఈ దృష్ట్యా సంవిధానపరమైన భారతీయత అనేది ఇంకా రూపుదిద్దుకుంటున్న గుణమే.

# కాంగ్రెస్ ప్రభుత్వమైనా

## భూముల ఆడిటింగ్ చేయాలి: అక్బరుద్దీన్ ఒవైసీ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్:ఈ రోజు సభలో జరిగింది పదేళ్ల భారాస పాలనను తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. సభ్యులు ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు సభకు వస్తారని.. ఇలా ఆందోళన చేసేందుకు కాదన్నారు. పదేళ్ల భారాస పాలన.. కచరా గవర్నెన్స్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు."ఇవాళ సభలో జరిగింది భారాస సంస్కృతికి నిదర్శనం. భారాస సభ్యులకు కేసీఆర్ బోధించింది ఇదేనా? ధరణి.. ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారు. భూముల ఆడిటింగ్ జరగాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. నా డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి" అని అక్బరుద్దీన్ కోరారు. సభలో చర్చ కొనసాగుతుండగానే భారాస సభ్యులు వాకౌట్ చేశారు.

కేటీఆర్ నిరాహార దీక్ష చేయొచ్చు కదా?: కూనంనేని

సభలో భారాస సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారాస నేతలు పదేళ్ల పాటు తెలంగాణ ప్రజల గొంతు నొక్కేశారని మండిపడ్డారు. "మా గొంతు నొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? తప్పుడు కేసు పెట్టారని కేటీఆర్ భావిస్తే నిరాహార దీక్ష చేయవచ్చు కదా?అలా చేస్తే కనీసం సానుభూతి అయినా వస్తుంది" అని కూనంనేని అన్నారు.

# ఆ కథనాలు అవాస్తవం: మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ పదవికి తనను నియమించాలని కేంద్రం యోచిస్తున్నట్లు వస్తున్న వార్తలను మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఖండించారు.

దిల్లీ: జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ పదవికి తన పేరును పరిశీలిస్తున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం తాను కుటుంబంతో కలిసి సమయం గడుపుతున్నానని.. మరో పదవిని స్వీకరించే ఆలోచన ఇప్పటికైతే లేదని స్పష్టం చేశారు.



సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా పదవీకాలం పూర్తి అయిన నాటి నుంచి (జూన్ 1) ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ పదవి ఖాళీగా ఉంది. తదుపరి ఛైర్‌పర్సన్‌ను ఎంపిక చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సమావేశమైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ ప్రాంగణంలో ఇటీవల జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం హాజరైన విషయం తెలిసిందే.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చీఫ్‌ని ఎంపిక చేసే కమిటీకి ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తుండగా.. ఇందులో లోక్‌సభ స్పీకర్, హోంమంత్రి, లోక్‌సభ, రాజ్యసభలో విపక్షాల నాయకులు, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ సభ్యులుగా ఉంటారు. ఈ పదవికి సాధారణంగా భారతదేశ మాజీ ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమిస్తారు. వీరి పేర్లను కమిటీ రాష్ట్రపతికి సిఫార్సు చేయాల్సి ఉంటుంది. జస్టిస్ మిశ్రా పదవీ విరమణ చేసిన తర్వాత ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయానీ తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.

2022 నవంబర్‌లో భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ డి.వై చంద్రచూడ్ ఎన్నో ముఖ్యమైన కేసుల్లో చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు. సీజేఐగా ఆయన పదవీకాలం ముగిసిన అనంతరం.. ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు స్వీకరించారు.

# క్రీడలలో గెలుపు, ఓటములు సహజము

**హైదరాబాద్ డిసెంబర్ 20 జన తెలంగాణ,**

క్రీడలలో గెలుపు, ఓటములు సహజమని,ఓటమి విజయానికి నాంది కావాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ పి ఎల్ క్రికెట్ మ్యాచ్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

మనిషి అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని ,అందువల్ల ప్రతి ఒక్కరు బాగా కష్టపడి పని చేసి పైకి రావాలని పిలుపునిచ్చారు. ఎన్ జి కళాశాల మైదానాన్ని భవిష్యత్తులో అందరికీ అనుకూలంగా ఉండే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. జిల్లా అభివృద్ధి లో భాగంగా ఎస్ఎల్ బీసీ కి 4000 కోట్ల రూపాయలను మంజూరు చేయించి టన్నెల్ తవ్వే మిషన్ బేరింగ్ ను అమెరికా నుండి తెప్పిస్తున్నామని, రెండు మూడు నెలల్లో బ్రాహ్మణ వెల్లేముల ప్రాజెక్టు ద్వారా నీళ్లు నింపి నల్గొండ పట్టణం సమీపంలోని చర్లపల్లి వరకు మీరు ఇస్తామని తెలిపారు. ఎం జి యూనివర్సిటీలో రెండు కొత్త బ్లాక్ లు నిర్మిస్తున్నామని, ఐటి టవర్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, లతీఫ్ సాబ్ గుట్టను 107 కోట్ల రూపాయలతో టూరిజం కేంద్రంగా మార్చేందుకు టెండర్లు పిలవడం జరిగిందని, రాబోయే నాలుగేళ్లలో నల్గొండను బంగారు కొండగా చేస్తానని తెలిపారు. నల్గొండ పట్టణంలో ప్రమాదాలను నివారించేందుకు, ట్రాఫిక్ జామ్ ను నియంత్రించేందుకు ఉద్దేశించి చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రన్నర్స్




విన్నర్స్ కు ట్రోఫీలను అందజేశారు. కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన రక్తదాన శిబిరం లో 200 మంది రక్తాన్ని దానం చేసినట్లు మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూనే శారీరకంగా దృఢంగా ఉండాలని, ఆరోగ్యంతో పాటు ,చదువు పైన దృష్టి సారించాలని క్రీడాకారులతో కోరారు. గెలుపొందిన జట్లకు ఆమె అభినందనలు తెలిపారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ క్రీడలు మనిషి జీవితంలో అతి ముఖ్యమని, ఓడినవారు, గెలిచినవారిని స్ఫూర్తిగా తీసుకొని ఆటలాడాలని పిలుపునిచ్చారు .జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మిషన్ పరివర్తన తీసుకురావడం జరిగిందని, దీనికి అందరు సహకరించాలని కోరారు .

అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మలమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# 42 పడకల ఆసుపత్రిని ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొని రావాలి..... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం అవుతున్న 42 పడకల ఆసుపత్రి భవనాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, డిసెంబర్ -20: జన తెలంగాణ**




నూతనంగా నిర్మాణం చేపట్టిన 42 పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం అవుతున్న 42 పడకల ఆసుపత్రి భవనాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో ప్రజల సౌకర్యార్థం ఆసుపత్రి ప్రాంగణంలో మరో 42 పడకల ఏర్పాటు చేసేలా భవన నిర్మాణం జరుగుతుందని, వీటి పనులను జనవరి 2025 లోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనులు నాణ్యతతో ఉండాలని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పనులు వేగవంతంగా జరగడంతో పాటు నాణ్యత అంశం లోనూ ఎక్కడ రాజీ పడవద్దు అని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో టీఎస్.ఎమ్.ఐ.డీసీ. ఈఈ ఏ.రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయొద్దు:

మొదటిపేజీ తరువాయి

ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది.

**కేటీఆర్ తరపు న్యాయవాదుల వాదనలు ఇలా..**

"అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ముఖ్యంగా 13(1)(%ఋ%) సెక్షన్ ఈ కేసుకు వర్తించదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరైంది కాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ కూడా లేకుండా కేసు పెట్టారు. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబరు 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కి తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసింది.

సీజన్-9 వల్ల దాదాపు రూ.700 కోట్ల లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు అంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దయింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్టు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు" అని కేటీఆర్ తరపు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు.

**కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుంది: ఏజీ**

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమే. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదు. దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. రెండు నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. కేసు నమోదు కోసం గవర్నర్ నిర్ణయానికి పంపారు. గవర్నర్ ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు డబ్బు విదేశీ కరెన్సీలో చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదు" అని ఏజీ వివరించారు.

గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనేది దర్యాప్తు కోసమేనని వివరించారు. కేసు పూర్తి వివరాలు అభియోగపత్రంలో ఉంటాయని, రూ.56 కోట్లకు పైగా చెల్లింపుల్లో నిబంధన ఉల్లంఘన జరిగిందని ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు.

# జైలుకెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్:"జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే" అని సీతక్క చెప్పారు.

# తెలంగాణలో ప్రతి సమస్య

## భూమితోనే ముడిపడి ఉంది: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయి.గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జీన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు" అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

**విపక్ష పార్టీ అహంకారంతో వ్యవహరిస్తోంది**

విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. "రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా" అని సీఎం తెలిపారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం డిసెంబర్ 21 2024

# అమిత్ షాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై భారత పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసారని, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు మేడ్చల్ పట్టణంలో మండల కాంగ్రెస్ పార్టీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా, మండల, యువజన కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

# దోపిడీ దొంగల అరెస్ట్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

శామీర్ పేట్ పోలీసులు దొంగతనం కేసును చాకచక్యంగా ఛేదించారు.
ఓ వృద్ధ మహిళను బెదిరించి బంగారు గొలుసు లాక్కొని పారి పోయిన ఇద్దరు దొంగలను శామీర్ పేట్ పోలీసులు పట్టుకున్నారు.ఈ సదర్భంగా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఏసీపీ రాములు మీడియా సమావేశం నిర్వహించారు. బంగారు గొలుసు లాక్కెల్లిన దుండగులు నూనె అంజిరెడ్డి, సండిటి నరేందర్ రెడ్డిలను అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడం జరిగిందని ఏసీపీ తెలిపారు.

# మేడ్చల్ బస్ డిపోలో అవార్డులు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి.**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ శ్రీ ఎం. రాజశేఖర్ గారు మేడ్చల్ డిపోను శుక్రవారం సందర్శించారు.అనంతరం మేడ్చల్ డిపోలో మొక్కలు నాటి ప్రగతి చక్రం పురస్కారాలు అట్టహాసంగా నిర్వహించారు.నవంబర్- 2024 నెలలో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లకు మరియు అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లకు, బ్రేక్ డౌన్ లేకుండా బస్సులను మెయింటనేన్స్ చేసిన మెకానిక్, ఇతర కార్మికులను, సూపర్ వైజర్లను ప్రసంశా పత్రాలతో సన్మానించారు.

# భవన నిర్మాణ రంగ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు తగదు

**కరపత్రం నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 20 :**

రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు ఇస్తామని చెప్పిన హామీలను అధికారంలోకి రాగానే మరిచిపోతున్నారని బి ఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం అన్నారు.పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలుగుతామని అందుకోసం ఉద్యమాలు ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.నగరంలోని ఆర్ అండ్ బి అతిధి గృహంలో భవన నిర్మాణ కార్మిక రంగాల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను ఘనంగా సన్మానించారు. అవగాహన సదస్సులో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జిల్లా అధ్యక్షుడు కల్లెడ గంగాధర్ మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి హామీలను నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి నెరవేరుస్తామని అధికారంలోకి వచ్చినప్పటికీ ఇప్పటికీ హామీలను నెరవేర్చ లేదన్నారు. సమస్యల సాధన కోసం జనవరి 8,9తేదీలలో హైదరాబాద్లోని ధర్నా చౌక్ లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బాబురావు షిండే నరేందర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో అయ్యప్ప జాతర

**ఆకుల రంజిత్ కరపత్రం ప్రతినిధి**
**కోరుట్ల నియోజకవర్గం**






కోరుట్ల అయ్యప్ప జాతర ఈ డిసెంబర్ నెల 27 వ తేదీన కోరుట్లలో అంగరంగ వైభవంగా అయ్యప్ప జాతర ఏర్పాట్లు జరుగుతున్నాయి.
జాతర కు సంబంధించి నిన్న అయ్యప్ప జాతర కరపత్రం ఆవిష్కరణ జరిగింది.దేవాలయ కమిటీ సభ్యులు మరియు అధ్యక్షుని సమక్షం లో ఆలయ ప్రాంగణం లో కరపత్రం విడుదల చేయబడింది. అధిక సంఖ్యలో భక్తులు,ప్రజలు పాల్గొనవలసిందిగా కోరడం జరిగింది. ఇందులోఆలయ ప్రధాన అర్చకులు రాము శర్మ గారు.దేవాలయ కమిటి అధ్యక్షులు అంబటి శ్రీను గారు, గడ్డం మధుగారు, మరిపెల్లి రవి గౌడ్ ఇతరులు పాల్గొన్నారు.ప్రతిఏటా వేలాది భక్తులు పాల్గొనే ఈ జాతరలో ఈ సం.అత్యధిక ప్రజలు పాల్గొనే అవకాశమున్నందున ఆలయ కమిటీ తగు ఏర్పాట్లు చేస్తున్నది.జాతర రోజు భక్తులు, సామాజిక కార్యకర్తలు,ప్రజలు తగిన సహకారం అందించాల్సిందిగా ఆలయ కమిటీ కోరింది.

# ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే కేటీఆర్ పై కేసు

- ఫార్ములా ఈ రేసులో 55 కోట్ల అవినీతి...
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి...

**కరపత్రం నిజామాబాద్, డిసెంబర్ 20 :**



ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ 55 కోట్ల అవినీతికి పాల్పడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే కేటీఆర్ పై కేసు నమోదు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఆరోపించారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,ఫార్ములా ఈ రేసు కేసులో భాగంగా గవర్నర్ ఆమోదం తెలపడంతో ఏ1 గా ఉన్న కేటీఆర్ పై ఎఫ్ ఐ ఆర్ నమోదు కావడంతో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన పడుతూ రేవంత్ రెడ్డి పై దుష్ప్రచారం చేసే విధంగా పాల్పడుతున్నారని, గత సంవత్సర కాలంగా కేటీఆర్ హరీష్ రావు వాస్తవాలను పక్కన పెడుతూ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. ఫార్ములా ఈ రేస్ లో భాగంగా కేటీఆర్ చేసిన అడ్డగోలు ఒప్పందాల వల్లనే ఆయనపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆరోపించారు.ప్రభుత్వానికి జిహెచ్ఎంసి కి మంత్రి వర్గానికి ఎలాంటి సంబంధం లేకుండా కేవలం కేటీఆర్ పురపాలక మంత్రిగా విచక్షణ రహితంతో అధికారాన్ని వాడుకొని రాష్ట్రంలో ఈ రేసును నిర్వహించడం జరిగిందన్నారు. ఫార్ములా ఈ రేసు ద్వారా అక్కడ ఉన్న ప్రజలు ఎంత ఇబ్బంది పడ్డారో రాష్ట్రమంతా చూశారని,ఫార్ములా ఈ రేసులో భాగంగా కేటీఆర్ 55 కోట్ల అవినీతి చేశాడని ఏసీబీ కేసు నమోదు చేస్తే దీనిని శాసనసభలో చర్చించాలని పక్కదారి పట్టించే ప్రయత్నం టిఆర్ఎస్ నాయకులు చేస్తున్నారని మానాల మోహన్ రెడ్డి దుయ్యబట్టారు. నిజానికి ఫార్ములా ఈ రేసు నిర్వాహణలో ప్రభుత్వం కేవలం మధ్యవర్తిత్వం వహిస్తూ సదుపాయాలను అందించడమే ఒప్పందం చేసుకుందని కానీ నిర్వహిస్తున్న కంపెనీల లాభనష్టాలకు ప్రభుత్వానికి సంబంధం లేదనే విధంగా ఒప్పందం చేసుకుంటే ఫార్ములా ఈ రేసు నిర్వహిస్తున్న క్రమంలో నిర్వహణ కంపెనీలకు 200 కోట్లు నష్టం రావడంతో కేటీఆర్ ప్రజాధనాన్ని 55 కోట్ల రూపాయలు వారికి దారాదత్తం చేశాడని, ఆ కారణంగానే కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు చేసిందని మానాల మోహన్ రెడ్డి వివరించారు. కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని,దీనిని రాష్ట్ర ప్రజలు బిఆర్ స్ నాయకులు గమనించాలని మానాల మోహన్ రెడ్డి అన్నారు. కేటీఆర్ అరెస్ట్ అయితే రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు చేయాలని సందేశాన్ని పంపుతున్నాడని కానీ టిఆర్ఎస్ నాయకులు గమనించాలని అలర్లు చేస్తే తమ పిల్లల జీవితాలే నాశనం అవుతాయి కావున కేటీఆర్ ఈ రేసు కేసును ఏసీబీ వద్ద పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశం నూడా చైర్మన్ కేశవేణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్,జిల్లా ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు వేణురాజ్ ,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్,అబూద్ బిన్ హన్దాన్, చందూర్ వైస్ ఎంపీపీ దశ గౌడ్,సాయికిరణ్,మాజీ కార్పొరేటర్లు స్వామి గౌడ్,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పీసీసీ ఛీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ క్రికెట్ టోర్నీ అభినందనీయం





- కులమతాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తిని చాటారు...
- విజేత,రన్నర్‌లకు ట్రోఫీలు,నగదు ప్రోత్సాహకాలు...
- అడిషనల్ డిసిపి బసవరేడ్డి,రైతు కమిషన్ సభ్యులు గడుగుగంగాధర్...

**కరపత్రం నిజామాబాద్, స్పోర్ట్స్,డిసెంబర్ 20 :**

పీసీసీ ఛీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పేరు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విజయవంతం చేయడం అభిందనీయమని అడిషనల్ డిసిపి బసవరెడ్డి రేడ్డి అన్నారు. ఈ నెల 3 నుంచి 20వరకు పీసీసీ ఛీఫ్ మహేష్‌కుమార్ క్రికెట్‌కప్ టోర్నమెంట్‌ను ఆర్గనైజర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంగా నిర్వహించగా ముగింపు శుక్రవారం పాలిటేక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ముఖ్య అథితిగా అడిషనల్ డిసిపి బసవరెడ్డి, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్‌లు హాజరైనారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ, ఆటల పోటీల్లో కులాలకు, మతాలకు తావివ్వకుండా అందరు స్నేహపూర్వకంగా ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే విదానాన్ని కొనసాగించాలన్నారు. ముఖ్యంగా క్రికెట్‌కు చాలా ఆదరణ ఉందని, ఆడినా, ఓడినా రెండు సమానంగా తీసుకోవాలన్నారు. ఆటలో గెలుపు, ఓటములు సహజమని అన్నారు. క్రీడా స్ఫూర్తి చాటడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు నచ్చిన క్రీడలో సాధన చేయాలన్నారు. గత 18 రోజులుగా జిల్లాలో పెద్ద ఎత్తున క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా జిల్లాలోని నలుమూలల నుంచి క్రిడాకారులు పాల్గొని ప్రాతినిత్యం వహించారు. విజేత,రన్నర్‌లకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అనంతరం రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ మాట్లాడుతూ, జిల్లా నుంచి ఉన్నతంగా ఎదిగేలా క్రికెట్‌లో రాణించాలన్నారు. ప్రతినిత్యం ప్రాక్టీసు చేసి ఉన్నత –శిఖారాలను అధిరోహించాలన్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విన్నర్, రన్నర్‌లకు ట్రోఫీలు, నగదు ప్రోత్సహాకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోటీ పిసిసి రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు దయాకర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు రత్నాకర్, టోర్నీ ఆర్గనైజర్ శ్రీనివాస్‌గౌడ్, ఎర్రం గంగాధర్, ఖుద్దుస్, శ్యామ్, తదివతరులు పాల్గొన్నారు.
అనంతరం విజేతగా నిలిచిన ఆరెంజ్ ఆర్మీ(రూ. 25వేలు నగదు)ట్రోపి అందజే
రన్నర్‌గా నిజామాబాద్‌స్టార్(రూ. 15వేల నగదు) ట్రోపి
మ్యాన్‌ఆఫ్‌దమ్యాచ్- శివ
బెస్ట్‌బ్యాట్స్‌మెన్ - శివ బెస్ట్ బౌలర్- చైనా రాజు
బెస్ట్‌ఫీల్డర్- జాఫర్
బెస్ట్ క్యాచ్- మీర్జాలకు ట్రోఫీలు అందజేశారు.

# మరణించిన బొల్లారం పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచిన

- జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి
- మెదక్ పార్లమెంటు ఎంపీ రఘునందన్ రావు
- బిజెపి నాయకులు ప్రముఖ సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి
- తమ కుటుంబాన్ని ఆదుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన కార్మికుని కుటుంబసభ్యులు
- మృతుడు నరసింహ కుటుంబానికి డబుల్ బెడ్ రూం
- 30 లక్షల రూపాయల ప్రభుత్వ సహాయం కేటాయింపు



**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ లోగత నెల పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన నరసింహ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా డబుల్ బెడ్ రూం, 30లక్షల రూపాయలు కేటాయించడం తో తమకు న్యాయం చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా ఉన్నత ప్రభుత్వ అధికారులకు బొల్లారం మున్సిపల్ రాజకీయ ప్రతినిధులకు ప్రముఖ సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డికి మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా నరసింహ మృతి చెందిన రోజున వారి కుటుంబానికి అండగా నిలిచి, తమ కుటుంబానికి న్యాయం జరిగేలా ఉన్నత అధికారులకు ఒత్తిడి తీసుకొచ్చిన మెదక్ ఎంపీ రఘునందనరావు, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జిల్లా ఉన్నతాధికారులకు,బిజెపి పార్టీ బొల్లారం మున్సిపల్ శాఖ అధ్యక్షుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి,జిల్లా పార్టీ నాయకులు రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ చారి లకు ఆ కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మా కుటుంబానికి అండగా నిలబడి న్యాయం జరిగేంత వరకు తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిన కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి కృషి మరువలేనిది అని అన్నారు. మెదక్ ఎంపీ రఘునందనరావు తో చర్చించి జాతీయ స్థాయి అధికారులతో మాట్లాడి తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చేయడంలో ఆనంద్ కృష్ణారెడ్డి పాత్ర మరువలేనిదని వారు అన్నారు. అంతేకాకుండా బొల్లారం మున్సిపల్ పరిధిలోని అందరు కౌన్సిలర్లు తమ కుటుంబానికి అండగా నిలబడి తమకు డబుల్ బెడ్ రూం కేటాయించడంలో సహాయసహకారాలు అందించడం పట్ల వారు కృతజ్ఞతలు వ్యక్తపరిచారు.
మృతుడు నరసింహ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ ఎప్పుడూ పేదలకు సాయం చేయడం లో ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. మెదక్ ఎంపీ రఘునందనరావు, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సహకారం వల్లే మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చేయగలిగామని, అధికారులతో సంప్రదింపులు జరిపి ఆయన ముప్పై లక్షల రూపాయలు కేటాయించేలా చేయడం జరిగిందని తెలిపారు. నిరుపేదలకు ఎటువంటి కష్టం వచ్చినా ముందుండి ఆయా కుటుంబాలను ఆదుకుంటూ తనవంతు కృషి చేస్తానని మరో సారి ఆయన ఉద్ఘాటించారు.

# మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం 1336 కు చేరిక....

**కరపత్రం ప్రతినిధి వేములవాడ డిసెంబర్ 20....**
మీ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1336 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున లక్ష్మీగణపతి, రాజన్న మరియూ భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా వుత్తూరి రవీందర్ మల్లేశ్వరి దంపతులు, జువ్వాడి స్నేహలత వెంకటేశ్వరరావు దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు ఉన్నారని అన్నదాన కార్యక్రమానికి శాశ్వత సభ్యత్వం పొందాలి అనుకునే అన్నదాతలు ట్రస్టు సభ్యులను గాని, ట్రస్టు ఫోన్ నం 92469 39388 నంబరు ద్వారా సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మహేష్ కోరారు.నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, పొలాస రాజేందర్, చల్లా సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.




# ఆకట్టుకున్న దీపాలంకరణ పోటీలు

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 20**

సింగరేణి దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం మహిళలకు స్థానిక కమ్యూనిటీహాల్ నందు నిర్వహించిన దీపాలంకరణ పోటీలను రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకరరావు, విజయలక్ష్మి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఇట్టి దీపాలంకరణ పోటీలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విభిన్న రకాలుగా రంగవల్లులు వేసి దీపాలతో అందంగా అలంకరించారు. తదనంతరం దీపాలంకరణ చేసిన రంగవల్లులను పరిశీలించి ఉత్తమంగా దీపాలతో అలంకరించిన రంగవల్లులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల కుటుంబాల మహిళలతో పాటు స్థానికంగా నివసిస్తున్న మహిళలను ప్రోత్సహించడం కోసం ఇలాంటి




పోటీలను గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు స్థానిక రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణం నందు ఈనెల 23న నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయబడునని తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా కళాకారులచే చక్కని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడమైనదని, మహిళలు కుటుంబ సమేతంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటింగ్ ఆఫీసర్ గుర్రం శ్రీహరి, డిపీఎం వి.సునీల్ ప్రసాద్, హరిణి, సుజాత, సేవా కార్యదర్శి, కె.మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఆర్.ఉమాదేవి, సేవా కోఆర్డినేటర్ కె.సుధాకర్, సేవా సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అవమానించడం సబబు కాదు...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, డిసెంబర్ 20.**

ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని తక్కువగా చేసి మాట్లాడుతూ... దేశ ప్రజలు పదేపదే అంబేద్కర్ పేరును స్మరించకూడదని,దళితులు,అంబేద్కర్ వారసులు గాని దేశంలో వాళ్ళని ఉనికి లేకుండా వాళ్ళను భయభ్రాంతులను చేస్తూ కేంద్రమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడడం విడ్డూరంగా ఉందని,ఇలాంటి చౌక బారు మాటలు మాట్లాడడం సరికాదు ఇంతకుముందు కూడా ఎలక్షన్లలో నాలుగు వందల పై ఎంపీ సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పి మరొకసారి అంబేద్కర్ కించపరుస్తూ బిజెపి వాళ్ళ అసలు రూపాన్ని బయటపెట్టుకున్నారు. దేశ ప్రజలు బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు ఇప్పటికైనా వాళ్ళ అస్సరూపం బయటపడిందని వెంటనే పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ కి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని దేశ ప్రజలందరూ,హెచ్చరిస్తున్నారు వచ్చే స్థానిక ఎన్నికల్లో బిజెపిని గ్రామ గ్రామాల్లో మట్టి కరిపించడం ఖాయమని వీణవంక మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మరొకసారి వారిని గుర్తు చేసుకున్నారు.మాదాసీ సునీల్ మార్కెట్ డైరెక్టర్, గంగాడి రాజిరెడ్డి, గొట్టె రాజయ్య,యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శి వోరెం అఖిల్,ఆవాల రామకృష్ణ, దాసారపు రమేష్,రాజ కొమురయ్య, మండల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం...

- మహిళ హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి...
- మండల ప్రత్యేక అధికారి నాగార్జున....

**కరపత్రం: శంకరపట్నం డిసెంబర్ 20**
రాష్ట్ర ప్రభుత్వము ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, మండల ప్రత్యేక అధికారి నాగార్జున సూచించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని కేశవపట్నం, చింతలపల్లె గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల్లో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఫ్రైడే డ్రై డే, కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన మండల ప్రత్యేక అధికారి నాగార్జున మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వము మహిళల, చిన్నారుల ఆరోగ్యం కోసం, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, అందులో భాగంగా మహిళల ఆరోగ్యం కోసం, మహిళ హెల్త్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి మహిళ మహిళా హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, చిన్నారులకు పౌష్టికాహారం, అందించడం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి గొట్టే శ్రావణ్ కుమార్, ఎంపీ ఓ కాసగోని భాస్కర్, అంగన్వాడి సూపర్వైజర్లు కవితా, స్రవంతి, గ్రామపంచాయతీ కార్యదర్శి డి నరసయ్య, హెల్త్ సూపర్వైజర్ అనిల్, అంగన్వాడి టీచర్లు సోనీ, సరిత, పద్మ కుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళలు ,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా స్వచ్ఛత పితామహుడు సంత్ గడ్గే వర్ధంతి వేడుకలు...

- ఘనంగా రజక సంఘం ఆధ్వర్యంలో సంత్ గడ్గే బాబా వర్ధంతి వేడుకలు....

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 20..**
స్వచ్ఛత పితామహుడు, పరిశుభ్రత దైవం, చీపురుతో వీధుల్ని, కీర్తనలతో మెదడును సాంఘిక సంస్కర్త స్వచ్ఛత పితామహుడు సంత్ గడ్గే బాబా 68వ జయంతి వేడుకలను కరీంనగర్ జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రజక సంఘం నాయకులు మాట్లాడుతూ సంత్ గడ్గే బాబా ప్రజా ఆరోగ్యం కోసం స్వచ్ఛత పితామహుడు గా తానే స్వయంగా పరిసరాలను పరిశుభ్రం చేసి మనుషుల మెదడును కీర్తనలతో పెంచాడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను ఖండించిన జి రవి ముదిరాజ్

జి రవి ముదిరాజ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షులు..జి రవి ముదిరాజ్

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.**
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పట్ల అమర్యాదగా మాట్లాడిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా. శుక్రవారం రోజున మేడ్చల్ పట్టణం లో ఉమ్మడి మేడ్చల్ మండల అధ్యక్షుల ఆధ్వర్యములో" అంబేద్కర్ కి పాలబిషేకం చేసి, అమిత్ షా చేసినా వాక్యాలను తీవ్రంగా ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన కార్యక్రమం చెప్పట్టడం జరిగింది, ఈ యొక్క నిరసన కార్యక్రమం లో ఉమ్మడి మేడ్చల్ మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

